క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన బీసీ సంఘం నేతలు



గవర్నర్‌తో బీసీ సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన జిల్లా బీసీ సంఘం నేతలు రాష్ట్ర గవర్నర్ తమిళిసైని ఆదివారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆలోచనలతో, ఆచరణలతో నూతన సంవత్సరంలో ముందుకెళ్లాలని గవర్నర్ సూచించినట్లు చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీసీ సంఘం జిల్లా నాయకులు బజారు భిక్షపతి, ఆంజనేయులు, సతీష్ ఉన్నారు.

మాల్‌లో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్ తదితరులు

యాచారం: మాల్ కేంద్రంలోని సాగర్‌రోడ్డుపై ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ చేశారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 28 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జెండావిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని అన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లతో అధికారంలోకి వస్తున్న రాజకీయ నేతలు అనంతరం ఎస్సీ రిజర్వేషన్‌పై మాట మార్చుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సిద్దపురం శ్రీకాంత్, కొమ్ము మహేష్, కొడాపురం కృష్ణ, బోడ కృష్ణ, చిన్నోళ్ల యాదయ్య, నల్లవెల్లి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ సభ్యురాలు రాధామనోహర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి కర్నాటి కొండల్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు యాదయ్య, రమేష్, బాలకృష్ణ, రాములుయాదవ్, శివకుమార్, రామ్మోహన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

బొంగ్లూర్‌లో అయ్యప్ప మహాపడిపూజ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్ గేటు వద్ద బీఆర్‌ఎస్ మున్సిపల్ నాయకులు పయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుర్మసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ యువజన నాయకులు రాజు, పయిళ్ల తిరుమల్‌రెడ్డి, దర్శన్‌గౌడ్, సదానందం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడమటి తండాకు చెందిన భాస్కర్‌నాయక్ (56) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జి, కృష్ణనాయక్, పుల్యానాయక్, వేఘ్యానాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు రూ.42వేలు అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సీతారాంనగర్‌తండా సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్‌ను ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న సర్పంచ్ లక్ష్మణ్ తన ఇంట్లో విశ్రాంతి పొందుతున్నాడు. లక్ష్మణ్‌ను ప్రజాప్రతినిధులు పరామర్శించి రూ.42 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్ట నారాయణ, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, నాయకులు యాదయ్య, రమేశ్‌నాయక్, సోమ్లనాయక్, రైసల్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నిధులు లేక నిలిచిన పనులు



నిర్మాణ దశలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయ నూతన భవనం

- తహసీల్దార్ భవన నిర్మాణానికి నిధుల మంజూరులో జాప్యం
- తాత్కాలిక భవనంలో అధికారులు, ప్రజల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో కొత్తగా నిర్మిస్తున్న తహసీల్దార్ భవన నిర్మాణ పనులు నిధులేక నిలిచిపోయాయి. నిజాం కాలంలో నిర్మించిన పాత తహసీల్దార్ భవన కార్యాలయాన్ని కూల్చివేసి అదే స్థానంలో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణానికి గతేడాది ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. పాత భవనంలోని తహసీల్దార్ కార్యాలయాలన్ని తాత్కాలికంగా విశ్రాంతి భవనంలోకి మార్చారు. అక్కడి నుంచి కార్యాలయ విధులను అధికారులు నిర్వహిస్తున్నారు.ఎలాంటి సెక్యూరిటీ లేకుండా ఇరుకుగదుల్లో అధికారులకు కూర్చునే అవకాశం లేకుండా కొత్త భవనంలో కార్యాలయం కొనసాగుతుంది.దీంతో ఈ కార్యాలయానికి వివిధ పనులపై, రిజిస్ట్రేషన్లకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూడు నెలలుగా నిలిచిన పనులు..

కొత్త తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని 6 నెలల్లో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామని చెప్పిన ప్రజాప్రతినిధుల, అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. నిధుల సమస్యతో మూడు నెలలుగా భవన నిర్మాణం ఎక్కడికక్కడే ఆగిపోయింది. డీఎంహెచ్‌డీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కింద రూ.1.25 లక్షలు కొత్త తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులున్నంత వరకు నిర్మాణ పనులు పూర్తి చేసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారు. మరో కోటి రూపాయలు కేటాయిస్తేనే ఈ భవన నిర్మాణం పూర్తి అవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో...ఎప్పుడు తహసీల్దార్ భవనం పూర్తి అవుతుందో పాలకులకే తెలియాలి. అంతవరకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారికి తిప్పలు తప్పేలా లేవు. ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు కాలేదు



తహసీల్దార్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయి 3 నెలలు కావస్తోంది. మరో కోటి రూపాయలు ఈ నిర్మాణానికి అవసరం. ఇప్పటివరకు మంజూరైన నిధులతో పనులు చేయించాం. నిధులు మంజూరుకాగానే పనులు తిరిగి ప్రారంభిస్తాం.

– ఇంద్రసేనారెడ్డి, ఏఈ, ఇబ్రహీంపట్నం

స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తాం

వీఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు స్పష్టీకరణ



నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

మంచాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతోనే వీఆర్‌వస్ ఫౌండేషన్ వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆఫౌండేషన్ అధినేత కుకుడాల వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె.భిక్షపతి అన్నారు. ఆదివారం మంచాల మండల పరిధిలోని చాంద్‌ఖాన్ గూడ గ్రామంలో వీఆర్‌వస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్టర్ ఫిల్టర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే లక్ష్యంలో భాగంగా వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశామన్నారు. ఇది ఆయా గ్రామ పంచాయతీల పాలకవర్గం, ప్రజల సహకారం ఉంటేనే సాధ్యమన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మత్‌పూర్ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, కాంగ్రెస్‌నాయకుడు ప్రేమాకర్‌రెడ్డి, యువతరం యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న నేతలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండల మున్నురుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శులుగా లక్ష్మణ్, సాయిరాం, గౌరవాధ్యక్షులుగా రఘురాములు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, తిరుపతయ్య, కోశాధికారిగా గిరి, ప్రచార కార్యదర్శులుగా మహేశ్, సాయికిరణ్, కార్యదర్శులుగా అశోక్, నవీన్, కరుణాసాగర్, వినోద్, సురేశ్, కిరణ్, సహాయ కార్యదర్శులుగా నర్సింహ, సతీష్‌కుమార్, నర్సింహ, మల్లేశ్, గౌరవ సలహాదారులుగా జంగయ్య, రఘునందన్, మదన్‌గోపాల్, వెంకటేశ్, పెంటయ్యను ఎన్నుకున్నారు. అలాగే మున్నూరుకాప యువజన సంఘం అధ్యక్షుడిగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా సాయి, రాఘవేందర్, సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూత్యకార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయండి

మంత్రి సబితారెడ్డికి పత్యానాయక్ వినతి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని.. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్ కోరారు. హైద్రాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆదివారం మంత్రి సబితారెడ్డిని టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పత్యానాయక్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఆమనగల్లు మండలాన్ని రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేశారని ఆయన వివరించారు. ఆమనగల్లు పట్టణంలో ఆర్టీఓ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం, పోలీసు ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అలాగే మండలంలో వివిధ బీటీరోడ్లకు నిధులు మంజూరు చేయాలని పత్యానాయక్ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు దోనాదుల కుమార్, నాయకులు దేరంగుల వెంకటేశ్, గణేశ్, మహేశ్ ఉన్నారు.

శభాష్.. గాయత్రి

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



గాయత్రిని అభినందిస్తున్న ఎంఈఓ, పీఈటీ

తలకొండపల్లి: జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలకు మండల పరిధిలోని చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 10వ తరగతి విద్యార్థిని గాయత్రి ఎంపికైంది. తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం డిసెంబర్ 21న హైదరాబాద్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సెలక్షన్ నిర్వహించారు. గాయత్రితో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది క్రీడాకారులు సెలక్షన్‌లో పాల్గొన్నారు. ఈ సెలక్షన్‌లో ప్రతిభచాటిన గాయత్రి జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాపోటీలకు ఎంపికైనట్లు పీఈటీ పాండు ఆదివారం తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడా పోటీల్లో గాయిత్రి పాల్గొననుందని పీఈటీ పాండు చెప్పారు. ఈ సందర్భంగా ఎంఈఓ సర్దార్‌నాయక్, పీఈటీ పాండు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు గాయత్రిని అభినందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కార్పొరేటర్ శివపార్వతి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ శివపార్వతి

మీర్‌పేట: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతి సూచించారు. ఆదివారం నందిహిల్స్ ఫేజ్-1లోని వినాయక మండపంలో కాలనీ అధ్యక్షుడు కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శివపార్వతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, కాలనీవాసులు నగేశ్‌యాదవ్, ఎం.దుర్గయ్య, కె.జగన్మోహన్‌రావు, సీహెచ్.రఘునాథ్‌రెడ్డి, బి.శంకర్, జి.లక్ష్మణ్, వి.శ్రీనివాస్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

హయత్‌నగర్: వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలకు తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్‌లోని శ్రీ గోదా రంగనాయకి రంగనాథ స్వామి ఆలయంలో ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రణధీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారితో పాటు 12 మంది ఆల్వార్‌లు స్వయంభూగా ఇక్కడ వెలిశారని సహజ సిద్ధమైన ఉత్తర ద్వారం ఉండటం ఈ ఆలయ విశిష్టత అని ఆయన తెలిపారు. శ్రీరంగ పురంలోని రంగనాథ ఆలయంలో ఉన్నట్లు ఇక్కడ స్వామి వారు కొలుపై ఉండటంతో భక్తులు ఈ దేవాలయాన్ని ఇలా వైకుంఠంగా భావిస్తారని ఆయన తెలిపారు. సోమవారం ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో..

అబ్దుల్లాపూర్‌మెట్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ప్రముఖ దేవాలయాలను ముస్తాబు చేశారు. ముఖ్యంగా సంఘీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, కవాడిపల్లిలోని శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్ర స్వామి దేవాలయం, బలిజగూడలోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయం, అబ్దుల్లాపూర్‌మెట్‌లోని శ్రీ ద్వారకా షిర్డీ సాయిబాబా దేవాలయాలను ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

ఇబ్రహీంపట్నం రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్తరం ద్వారం ద్వారా దర్శణాలకు ఏర్పాట్లను చేశారు.

సేవ చేసేందుకే ఫౌండేషన్ స్థాపన

మీర్‌పేట: సేవ చేయాలనే లక్ష్యంతోనే అమ్మ ఫౌండేషన్‌ను స్థాపించినట్లు చైర్మన్ వై.శ్రీనివాస్ తెలిపారు. కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని వీ.ఆర్.గ్రాండ్‌లో ఆదివారం అమ్మ ఫౌండేషన్ ఆర్గనైజేషన్‌ను కార్పొరేటర్ కొండ్ర గౌరీశంకర్‌తో కలిసి శ్రీ నివాస్ ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా అనాథలు, నిరుపేద పిల్లలు, వృద్ధులకు అండగా నిలిచేందుకే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంబేద్కర్‌నగర్ వాసులు మల్లేశ్, కుమార్, కుమార్, భిక్షపతి పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



కడ్తాల్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఇబ్రహీంపట్నం: ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, కిషన్‌రెడ్డి

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ పట్టణానికి చెందిన వరికుప్పల జంగమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం సాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.2లక్షలు (ఎల్ఓసీ) సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు ఎల్ఓసీ చెక్కును ఆదివారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, టీఆర్‌ఎస్ యువజన నాయకులు రాజేందర్‌యాదవ్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో

ఇబ్రహీంపట్నం: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు రూ.6.08 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను ఆయన ఆదివారం అందజేశారు. అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన ఎం.వేణుకు, ఎ.మహేందర్‌కు రూ.1.25 లక్షల చొప్పున, ఆగాపల్లి గ్రామానికి చెందిన మహేశ్వరికి లక్ష రూపాయల ఎల్ఓసీలను, ఇబ్రహీంపట్నంకు చెందిన రమేష్‌కు రూ.40 వేలు, పి.శ్రీనివాస్‌కు రూ.56 వేలు, లక్ష్మీకి రూ.60 వేలు, లావణ్యకు రూ.12 వేలు, చైతన్యకు రూ.30 వేలు, దేవేందర్‌కు రూ.60 వేలు విలువచేసే చెక్కులను అందజేశారు.

జంగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్

మీర్‌పేట: మృతి చెందిన కార్మికుడు జంగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న జంగయ్య శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కిషన్ ఆదివారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్, జగదీష్‌తో జంగయ్య భౌతిక కాయానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. 25ఏళ్లుగా మీర్‌పేట ప్రాంతంలో ప్రజలకు సేవలందించిన జంగయ్య మృతి కు టుంబానికి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌కు తీ రని లోటన్నారు. కార్పొరేషన్ అధికారులు జంగయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసరి బాబు, యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

2023 నూతన సంవత్సర వేడుకలను ఆదివారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో అంతా శుభమే జరగాలని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతా శుభమే జరగాలని ఆకాంక్షించారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: శ్రీలక్ష్మీనృసింహస్వామి అలయంలో..



ఆమనగల్లు: సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కసిరెడ్డి



యాచారం: లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో



కడ్తాల్: ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



తలకొండపల్లి: ఆర్.కృష్ణయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



మాడ్గుల: వాకిట్లో ముగ్గు వేస్తున్న చిన్నారులు



ఆమనగల్లు: కేక్ కట్‌చేస్తున్న బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు

చదువుతో అంతరాలు దూరం

బీజేపీ నేత శ్రీరాములు యాదవ్

హుడాకాంప్లెక్స్: చదువుతో పేద, మధ్యతరగతి, కులం, మతం అంతరాలను చెరిపేయవచ్చునని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సరూర్‌నగర్‌కు చెందిన బద్దుల వెంకటేశ్ కుమార్తె సింధూ ఇటీవల ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికైంది. దీంతో ఆదివారం శ్రీరాములు యాదవ్ విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రయత్నించాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యుల బదిలీ

తలకొండపల్లి: తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులుగా పనిచేస్తున్న డాక్టర్ శారద, అదేవిధంగా డిప్యూటేషన్‌పై షాపూర్‌లో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్ బదిలీలు అయ్యారని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ శారద హైదరాబాద్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి, ప్రభాకర్ షాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారని ఆయన చెప్పారు. వీరి స్థానంలో నూతన డాక్టర్లు జాయిన్ అవుతారని, అదేవిధంగా గట్టుఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టు స్థానంలో నూతన వైద్యుడు రానున్నారని డీఎంహెచ్‌ఓ తెలిపారు.